

పరిశుభ్రతే ప్రధానం

పరిసరాల పరిశుభ్రతే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగాలని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఒంగోలులో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. - 8లో..



గాంధీజీ ఆశయ సాధనకు కృషి

గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో గాంధీజీకి నివాళులర్పించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
33/27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

జాతీయ స్థాయి స్కేటింగ్‌కు హనీష్, కార్తీక్ ఎంపిక



స్కేటింగ్‌కు ఎంపికైన క్రీడాకారులు

జరుగుమల్లి: 50 మీటర్ల రోలర్ స్కి స్కేటింగ్ అండర్-11 జాతీయ స్థాయి పోటీలకు సాయిబాబా సెంట్రల్ స్కూల్ విద్యార్థి పి.హనీష్, ఒంగోలు భాష్యం స్కూల్ విద్యార్థి ఎస్.కార్తీక్ ఎంపికయ్యారని రోలర్‌స్కి స్కేటింగ్ స్నో బోర్డు ప్రతినిధి పి.సురేష్‌రెడ్డి తెలిపారు. ఇటీవల ఒంగోలు టార్గెట్ థ్రిల్ బేస్ కోచింగ్ సెంటర్ ఆవరణలో పోటీలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 6, 8 తేదీల్లో రోలర్ స్కేటింగ్ స్కి స్నో బోర్డు, గుజరాత్ స్కి స్నో బోర్డు ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బరోడాలోని గుజరాత్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించే రోలర్ స్కి స్కేటింగ్ జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున పాల్గొంటారని బోర్డు ప్రతినిధి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా క్రీడా శాఖ కోచ్ రాజరాజేశ్వరి, టార్గెట్ కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు దీపక్ అభినందించారు.

4న కలెక్టర్ స్పందన పామూరులో..

ఒంగోలు అర్బన్: మండల స్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రత్యేక స్పందన కార్యక్రమం ఈ నెల 4వ తేదీ పామూరులోని అనిల్ గార్డెన్స్ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టరేట్ స్పందన విభాగం సూపరింటెండెంట్ నాగజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. స్పందన కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులంతా హాజరవుతారని, పామూరు మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కలెక్టర్‌గా ప్రజల సమస్యలు పరిష్కరించగలిగా

- మాజీ ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్



టంగుటూరు లో మాట్లాడుతున్న మాజీ ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్

టంగుటూరు: విద్యార్థి దశలోనే అనేక ఉద్యమాలు చేసిన వ్యక్తిగా, తరువాత కలెక్టర్‌గా ప్రజల సమస్యలు పరిష్కరించగలిగానని అని మాజీ ఐఏఎస్ అధికారి జీఎస్ఆర్‌కేఆర్ విజయ్‌కుమార్ అన్నారు. తడ నుంచి ప్రారంభించిన 'ఐక్యతా పథం' ర్యాలీ టంగుటూరులోకి సోమవారం ప్రవేశించింది. ఐక్యతా పథం యాత్రని దళిత రైట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అన్ని దళిత ప్రజా సంఘాలు స్వాగతించాయి. విజయ్‌కుమార్ మాట్లాడుతూ పేద ప్రజల బాధలు తెలుసుకొని, ఇంకా వారి మెరుగైన జీవితాలకు కావలసిన పరిష్కారాల కోసం అన్వేషించి పరిష్కారం చూపిస్తానని అన్నారు. అశోక్‌బాబు, కొమ్ము ప్రభుదాస్, క్రాంతి కుమార్ రాజు, బొల్లా హరీష్ దేవరాజ్ పాల్గొని విజయకుమార్ పాదయాత్రకి మద్దతు పలికారు.

మెడికల్ హబ్..

అత్యవసర వైద్యం నిమిత్తం పశ్చిమ ప్రకాశం వాసులు వందల కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వచ్చేది ఒకప్పుడు. అప్పటి వరకూ ప్రాణాలు నిలుస్తాయో లేదో అన్న అందోళన ఉండేది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఆ పరిస్థితి మారింది. పశ్చిమానికి గుండెగా ఉన్న మార్కాపురం అత్యాధునిక వైద్యసేవలకు కేంద్రంగా మారనుంది. ఒక వైపు జిల్లా ఆస్పత్రిలో అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. మరో వైపు వైద్య కళాశాల నిర్మాణ పనులు జోరందుకున్నాయి. వచ్చే ఏడాది నుంచి అడ్మిషన్లు ప్రారంభించే దిశగా అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.

- పశ్చిమాన వైద్యానికి కేంద్రంగా మార్కాపురం
- అందుబాటులోకి అత్యాధునిక వైద్యసేవలు
- జిల్లా వైద్యశాలలో జోరుగా అభివృద్ధి పనులు
- వడివడిగా మెడికల్ కళాశాల నిర్మాణం
- వచ్చే ఏడాది నుంచే అడ్మిషన్లు
- విద్యార్థుల కోసం 330 బెడ్ల ఏర్పాటుకు నిర్ణయం
- రూ.8 కోట్లతో 230 అదనపు బెడ్లు



చకా చకా సాగుతున్న మెడికల్ కళాశాల నిర్మాణ పనులు

మార్కాపురం:

ఒక వైపు జిల్లా ఆస్పత్రిలో వేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మరో వైపు రాయవరం వద్ద మెడికల్ కళాశాల పనులు శరవేగంగా సాగుతున్నాయి. వచ్చే విద్యా సంవత్సరం నుంచే ఇక్కడ అడ్మిషన్లు ప్రారంభించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించడంతో స్థానిక వైద్యశాఖాధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. వైద్యవిద్యార్థుల ప్రాక్టికల్స్ కోసం మొత్తం 330 బెడ్లను సిద్ధం చేయాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశించడంతో అందుకు తగిన విధంగా జిల్లా వైద్యశాలలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే ఆస్పత్రిలో 100 పడకలు ఉండగా, 230 అదనపు బెడ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.8 కోట్లను కేటాయించింది. వీటి నిర్మాణ పనులు డిసెంబరు నాటికి పూర్తిచేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇదిలా ఉండగా రాయవరం వద్ద 41.97 ఎకరాల విస్తీర్ణంలో రూ. 475 కోట్లతో చేపట్టిన మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. వచ్చే ఏడాది నుంచి అడ్మిషన్లు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తంగా 100 సీట్లు రానున్నాయి. నర్సింగ్ కాలేజీ, కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌లను కూడా ఏర్పాటు చేయనున్నారు. జనవరి నెలాఖరు లేదా ఫిబ్రవరి మొదటివారంలో నేషనల్ మెడికల్ కౌన్సిల్ సభ్యులు ఇక్కడికి రానున్నారు. ఈలోపే పనులన్నీ పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

500 పడకల ఆస్పత్రి

మెడికల్ కాలేజీలో భాగంగా 500 పడకల ఆస్పత్రి నిర్మాణం చేపడుతున్నారు. ఇందులో డాక్టర్స్, సిబ్బంది క్వార్టర్స్ నిర్మిస్తున్నారు. మొత్తం 18 విభాగాలను ఏర్పాటు చేస్తారు. 120 జనరల్ మెడిసిన్ బెడ్‌లు, 120 జనరల్ సర్జరీ బెడ్‌లు, 60 పిడియాట్రిక్ (చిన్న పిల్లల) బెడ్‌లు, 60 ఆర్థోపెడిక్ బెడ్‌లు, 60 గైనకాలజీ, 10 ఆప్తమాలజీ, 10 డెర్మటాలజీ, 10 బెడ్‌లు తల, మెదడు, చెవి, ముక్కు బాధితుల కోసం, 6 ఐసీయూ, 26 ఎమర్జెన్సీ బెడ్‌లు, ఇలా పలు చికిత్సల కోసం బెడ్‌లు ఏర్పాటు చేయనున్నారు. 8 ల్యాబ్‌లు, 4 లెక్చర్ థియేటర్‌లు, 250 మంది కూర్చునే ఎగ్జామినేషన్ హాల్, 8 టీచింగ్ రూంలు నిర్మించనున్నారు. ఇక స్టూడెంట్ హాస్టల్స్‌తో పాటు నర్సింగ్ హాస్టల్, సెంట్రల్ కిచెన్ హాల్, సెంట్రల్ డ్రగ్ స్టోర్, డయాలసిస్ సెంటర్, మెటర్నిటీ వార్డు తదితర భవనాలను కూడా నిర్మిస్తారు. ఒక్కొక్క విభాగంలో 10 మంది డాక్టర్లుంటారు. ఈ లెక్క ప్రకారం సుమారు 200 నుంచి 250 మంది వరకు సాధారణ వైద్యులతో పాటు స్పెషలిస్ట్ డాక్టర్లను నియమిస్తారు. కిడ్నీ రీసెర్చ్ సెంటర్ కూడా ఇక్కడే నిర్మించనున్నారు. ఇది పూర్తయితే జిల్లాలోని కిడ్నీ బాధితులకు కూడా డయాలసిస్‌తో పాటు మెరుగైన వైద్యసేవలు లభిస్తాయి. ప్రస్తుతం జిల్లా వైద్యశాలలో డయాలసిస్ సెంటర్ ఉంది. మార్కాపురంలోనే మెడికల్ కళాశాల ఏర్పాటు చేయటం వలన ఆధునిక వైద్యసేవలు అందుబాటులోకి రావటంతో పాటు స్పెషలిస్ట్ డాక్టర్లు కూడా ఉంటారు.



జిల్లా వైద్యశాలలో అదనపు బెడ్ల నిర్మాణ పనులు

డిసెంబర్ నాటికి అదనపు బెడ్ల నిర్మాణం పూర్తి



మార్కాపురం జిల్లా వైద్యశాలలో ప్రస్తుతం ఉన్న బెడ్లకు అదనంగా 230 బెడ్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రభుత్వం రూ.8 కోట్లను ఇందుకు కేటాయించింది. డిసెంబరు నాటికి పనులు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు సందర్శించనున్నారు.

– డాక్టర్ సుబ్బారెడ్డి,
జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్

మరింత మందికి వైద్య సేవలు

ప్రస్తుతం ఇక్కడున్న జిల్లా వైద్యశాల ద్వారా మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని ప్రజలకే కాకుండా, నంద్యాల జిల్లా శ్రీశైలం ప్రాంత ప్రజలకు కూడా వైద్య సేవలు అందిస్తున్నారు. సుమారు 6 లక్షల మంది ప్రజలకు ఈ వైద్యశాల ద్వారా సేవలందుతున్నాయి. మెడికల్ కళాశాల ఏర్పాటైన తర్వాత అదనంగా మరో రెండు లక్షల మందికి వైద్యసేవలు అందే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా కరోనా సమయంలో ఆక్సిజన్ ప్లాంట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు వైద్య ఆరోగ్య శాఖామంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఫలితంగా 3 ఆక్సిజన్ ప్లాంట్లను మంజూరయ్యాయి. నిరంతరాయంగా 100 బెడ్లకు ఆక్సిజన్ అందేలా ఏర్పాట్లు చేశారు. జిల్లా వైద్యశాలలో ఇప్పటికే నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించారు. ఒంగోలు రిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌ను మార్కాపురం మెడికల్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌గా నియమించడంతో పాటు జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్‌ను మెడికల్ కళాశాల సూపరింటెండెంట్‌గా కూడా నియమించారు.

గ్రామ స్వరాజ్యం దిశగా ప్రభుత్వం అడుగులు

- అహింసే ఆయుధంగా స్వాతంత్ర్య పోరాటం చేసిన మహనీయుడు గాంధీజీ
- మహాత్మగాంధీ జయంతి కార్యక్రమంలో కలెక్టర్, ఎమ్మెల్యే బాలినేని



గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ దినేష్‌కుమార్, మేయర్ గంగాడ సుజాత, కుప్పం ప్రసాద్ తదితరులు

ఒంగోలు అర్బన్: జాతిపిత మహాత్మగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని అందులో భాగంగానే గ్రామ సచివాలయాలు స్థాపించి ప్రజలకు ప్రభుత్వ సేవలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేరువ చేస్తోందని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం గాంధీజీ 154వ జయంతిని పురస్కరించుకుని గాంధీరోడ్డులోని గ్రామ చావడి వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి కలెక్టర్ దినేష్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నగర మేయర్ గంగాడ సుజాత, ఏఎస్పీ నాగేశ్వరరావు, పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నేతలతో కలిసి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ అహింసే ఆయుధంగా స్వాతంత్ర్యం సాధించిన మహనీయుడు గాంధీజీ అని కీర్తించారు. మహాత్ముడు చూపిన అహింస, సత్య మార్గాలను యువత ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఒంగోలులో భూకబ్జాలకు పాల్పడుతూ కొందరు అశాంతి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ దక్షిణాఫ్రికాలో వివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేసిన గాంధీజీ మన దేశానికి వచ్చి అహింస, సహాయ నిరాకరణ వంటి విధానాలతో పోరాటం చేసి దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చారన్నారు. గాంధీ ఆశయ స్ఫూర్తితో జిల్లాను అన్నీ రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇటీవల నకిలీ స్టాంపు పేపర్లతో భూకబ్జాలకు పాల్పడుతున్న ఘటనలు వెలుగు చేశాయని, అటువంటి కేసుల్లో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ గాంధీజీ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శప్రాయంగా తీసుకుని అనుసరించాలని అన్నారు. దీనిలో ట్రైనీ ఐఏఎస్ శౌర్యమన్‌పటేల్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, తహశీల్దార్ మురళి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జెడ్పీ కార్యాలయంలో మహాత్మునికి ఘన నివాళి



గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు: జిల్లా పరిషత్ కార్యాలయంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహాత్ముడు దేశానికి అందించిన సేవలను కొనియాడారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని గ్రామ స్థాయిలో ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందించేందుకు జిల్లా ప్రజా పరిషత్ అధికారులు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో హనుమంతరావు తదితరులు పాల్గొని మహాత్మునికి నివాళి అర్పించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

నాగులుప్పలపాడు: సచివాలయ ఉద్యోగుల్లో గ్రేడ్-5 సెక్రటరీలకు డీడీవోగా అధికారాలు ఇస్తూ జీవో ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తూ సచివాలయ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు రాయపూడి ఎలేన్ కుమార్ ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి సోమవారం స్థానిక ఎంపీపీ క్యాంపు కార్యాలయంలో క్షీరాభిషేకం చేశారు. ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ యాదాల రత్నభారతి పాల్గొన్న ఈ కార్యక్రమంలో అనంతరం గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

పామూరు: మండల కేంద్రమైన పామూరుతో పాటు బోడవాడ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈసందర్భంగా సోమవారం రాత్రి స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బోడవాడ గ్రామానికి చెందిన అనమసాని చిన్నక్కయ్య, బాల అంకయ్య, ఈర్ల చినతిరిపాలు, చెంబేటి మాల్యాద్రి, మీసాల చిన మాలకొండయ్య పాటు మరో 35 కుటుంబాల వారు, పామూరు కరెంట్ ఆఫీస్ కాలనీకి చెందిన దిల్‌దార్ మస్తాన్, ఖాజారసూల్, పోతుల శశిధర్‌తోపాటు మరో రెండు కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ, కులం, మతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. పార్టీలో చేరిన పలువురు నాయకులు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన, ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ చేస్తున్న అభివృద్ధి, ధర్మపాలనకు ఆకర్షితులై పార్టీలో చేరామన్నారు. మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, కోఆప్షన్ నాయబ్ రసూల్, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, గోవిందు కొండారెడ్డి, ఖాదర్‌బాషా, గోవిందయ్య, చెనికల శ్రీనివాసులు, మీసాల మాలకొండయ్య, చెంబేటి మహేంద్ర, చినమాలకొండయ్య, బచ్చు రామయ్య, యం.బాలఅంకయ్య, చెంబేటి నరసింహ, చినమాల్యాద్రి, కోటేశ్వరరావు, పెదమాల్యాద్రి పాల్గొన్నారు.

ఎన్ఐఏ సోదాల కలకలం

- కేఎన్‌పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి దుడ్డు వెంకట్రావు, మాజీ మావోయిస్టు మేడమ్ పెదరామిరెడ్డి, పద్మజ వీరాంజమ్మ ఇళ్లలో తనిఖీలు



కుంచేపల్లిలో మాజీ మావోయిస్టు రామిరెడ్డి, పద్మజలను విచారిస్తున్న ఎన్ఐఏ అధికారులు



చీమకుర్తిలో దుడ్డు వెంకట్రావు నివాసంలో ఎన్ఐఏ అధికారులు

చీమకుర్తి/పొదిలి రూరల్: ఎన్ఐఏ (నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ) అధికారులు సోమవారం ఉదయం జిల్లాలో పలుచోట్ల సోదాలు చేశారు. చీమకుర్తి అంబేడ్కర్ నగర్‌లోని కేఎన్‌పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి దుడ్డు వెంకట్రావు ఇంట్లో సోదాలు చేశారు. ఉదయం 4 గంటలకే వెంకట్రావు ఇంటి నుంచి బయటకు వెళ్లిపోగా.. 6 గంటల సమయంలో ఒంగోలు స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌తో ప్రత్యేక వాహనాల్లో ఎన్ఐఏ అధికారులు వచ్చారు. ఆ సమయంలో ఇంట్లో వెంకట్రావు భార్య ఆదిలక్ష్మి, కుమారుడు సంతోష్, కుమార్తె చరిత మాత్రమే ఉన్నారు. ఎన్ఐఏ అధికారులు 10 గంటల వరకు సోదాలు నిర్వహించి కుటుంబ సభ్యులను విచారించారు. వెంకట్రావుకు సంబంధించిన డైరీని, మణిపూర్ సంఘటనలకు సంబంధించిన పాంప్లెట్‌లను స్వాధీనం చేసుకున్నారు. సెల్‌ఫోన్‌లను పరిశీలించి తిరిగి ఇచ్చేశారు. కేఎన్‌పీఎస్ తరఫున వెంకట్రావు నిర్వహిస్తున్న కార్యక్రమాలపై ఆరా తీశారు. సీఆర్‌పీసీ సెక్షన్ 160 కింద దుడ్డు వెంకట్రావు పేరుతో నోటీసును కుమారుడు సంతోష్‌కు అందించారు. ఈనెల 20న హైదరాబాద్‌లోని ఎన్ఐఏ బ్రాంచ్ ఆఫీస్‌లో హాజరు కావాలని నోటీసులో పేర్కొన్నారు. దుడ్డు వెంకట్రావుకు వరసకు అన్న అయ్యే కేఎన్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దుడ్డు ప్రభాకర్‌ను రెండు నెలల క్రితమే విజయవాడలో ఎన్ఐఏ అధికారులు అరెస్టు చేశారు.

– అదేవిధంగా పొదిలి మండలం కుంచేపల్లి గ్రామంలో మాజీ మావోయిస్టు మేడమ్ పెదరామిరెడ్డి, పద్మజ వీరాంజమ్మ (శోభ) ఇంట్లో సోమవారం ఎన్ఐఏ డీఎస్పీ రామ్‌శర్మ ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటిలో అణువణువు క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల్లో రూ.5 లక్షల నగదు దొరికింది. దీనిపై వివరణ అడగ్గా 20 ఎకరాల పొలం కౌలుకు తీసుకొని సాగుచేస్తున్నామని.. వాటికి సంబంధించిన పెట్టుబడి డబ్బుగా పేర్కొన్నట్లు సమాచారం. ఇంటి నుంచి మూడు సెల్‌ఫోన్లు, అభ్యుదయ సాహిత్యానికి సంబంధించిన 11 సీడీలు, 14 పుస్తకాలు, అనుమానిత డాక్యుమెంట్లను ఎన్ఐఏ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

మావోయిస్టు కార్యకలాపాలు వదిలేసినా విచారణ పేరుతో వేధింపులా!

మావోయిస్టు కార్యకలాపాలు వదిలేసి తాము జన స్రవంతిలోకి వచ్చి 23 సంవత్సరాలైనా తనిఖీలు, విచారణ పేరుతో తమను పోలీసులు వేధిస్తున్నారని మాజీ మావోయిస్టు మేడమ్ పెదరామిరెడ్డి, ఆయన భార్య పద్మజ వీరాంజమ్మ (శోభ) ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల పాడేరులో చనిపోయిన కామ్రేడ్ సూర్యం ఫొటోలు, పేపర్ కటింగులు, తమ దగ్గర ఉన్న అభ్యుదయ పుస్తకాలు, ఉద్యమానికి సంబంధించిన పాటల పుస్తకాలు తీసుకొని ఈ ఆధారాలు చాలు మిమ్మల్ని అరెస్టు చేయడానికి అని బెదిరించారని చెప్పారు. తన భార్య అమరుల బంధుమిత్రుల సంఘంలో సభ్యురాలుగా ఉందని పెదరామిరెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో ప్రతి సంవత్సరం జూలై 18 తేదీన జరిగే అమరవీరుల బంధు మిత్రుల సంఘం సమావేశంలో పద్మజ పాల్గొంటున్నట్లు చెప్పారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మావోయిస్టు పెదరామిరెడ్డి, పద్మజ దంపతులు

క్లుప్తంగా

347 మద్యం సీసాలు స్వాధీనం



మద్యం సీసాలను చూపుతున్న చీమకుర్తి సెబ్ ఎస్సై నగేష్, సిబ్బంది

చీమకుర్తి: మద్దిపాడు మండలం దొడ్డవారం గ్రామంలోని యానం రామకోటేశ్వరరావు ఇంటి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 347 మద్యం సీసాలను సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు చీమకుర్తి సెబ్ ఎస్సై నగేష్ తెలిపారు. తాళ్లూరు మండలం శివరామపురంలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్న సీహెచ్ సీతారామయ్య ఈ మద్యం సీసాలను విక్రయించినట్లు విచారణలో తేలిందన్నారు. సేల్స్‌మన్‌తో పాటు రామకోటేశ్వరరావును అదుపులోకి తీసుకుని మద్యం సీసాలను చీమకుర్తి ఎక్సైజ్ స్టేషన్‌లో ప్రదర్శించి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నగేష్ తెలిపారు.

12 లీటర్ల మద్యం సీజ్



వివరాలు వెల్లడిస్తున్న సెబ్ సీఐ రాగమయి, ఎస్సై పద్మజ

మార్కాపురం: ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం తీసుకొచ్చి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, 12 లీటర్ల నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కరును సీజ్ చేసినట్లు చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ రాగమయి తెలిపారు. సోమవారం సాయంత్రం ఎస్ఈబీ కార్యాలయంలో ఆమె విలేకరులకు వివరాలు తెలిపారు. పట్టణంలో నివాసం ఉంటున్న లక్ష్మణ్‌సింగ్, వెంకటప్పయ్య దగ్గర నుంచి 3 గోవా మద్యం సీసాలు, కర్నాటకది ఒకటి, 7 మిలిటరీ మ్యదం బాటిళ్లను సీజ్ చేసినట్లు చెప్పారు. దాడుల్లో ఎస్సై పద్మజ, సిబ్బంది జీవీ పాల్గొన్నారు.

పరిశుభ్రతే ప్రధానం

- పారిశుధ్య కార్మికులను అందరూ గౌరవించాలి
- సమాజానికి వారి సేవలతో ఎంతో ప్రయోజనం
- కోవిడ్ సమయంలో తీసుకున్న కార్మికులను ఆప్కోస్‌లో చేరుస్తాం
- ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి
- ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయంలో ఘనంగా గాంధీ జయంతి, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు
- ముఖ్య అతిథిగా హాజరై పారిశుధ్య కార్మికులను సన్మానించిన బాలినేని



నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో మొక్క నాటి నీరు పోస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి, గంగాడ సుజాత తదితరులు

ఒంగోలు సబర్బన్: పరిసరాల పరిశుభ్రతే ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని మాజీ మంత్రి, ఒంగోల ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఒంగోలు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి బాలినేని ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా జాతిపిత మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ.. స్వచ్ఛ భారత్ దివస్‌ను పురస్కరించుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో సెప్టెంబర్ 15 నుంచి జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. స్వచ్ఛ భారత్ దివస్ ముఖ్య ఉద్దేశం 'చెత్త రహిత భారతదేశం' అని పేర్కొన్నారు. ఒంగోలు నగరపాలక సంస్థలో పారిశుధ్య కార్మికుల సేవలను బాలినేని కొనియాడారు. పారిశుధ్య కార్మికులను ప్రతిఒక్కరూ గౌరవించాలని సూచించారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలినాళ్లలోనే పారిశుధ్య కార్మికులకు ఒకేసారి నెలకు రూ.7 వేలు వేతనం పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. వారి సేవలు గుర్తించారు కాబట్టే శ్రమకుతగ్గట్టు ప్రోత్సహించారన్నారు. కోవిడ్ సమయంలో తీసుకున్న కార్మికులకు కూడా వచ్చే నెల నుంచి ఒకటో తేదీనే వేతనం ఇచ్చేలా చర్యలు చేపట్టామని చెప్పారు. వారిని ఆప్కోస్‌లో చేర్చేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. ధారావారి కుంటలో పారిశుధ్య కార్మికులకు చెందిన ఇళ్ల ప్లాట్ల విషయాన్ని త్వరలో పరిష్కరిస్తామన్నారు. ఒంగోలు నగరంలో ఇళ్లు లేని నిరుపేదలకు త్వరలో దాదాపు 25 వేల ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు.

ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రం చేసుకోవడంలో 100 ఏళ్ల క్రితమే జాతిపిత మహాత్మా గాంధీ చేసి చూపించి అందరికీ మార్గదర్శిగా మారారన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని 15 రోజులుగా ఒంగోలు నగరంలో ముమ్మరంగా చేపట్టామన్నారు. గాంధీ జయంతి సందర్భంగా నగరంలోని పారిశుధ్య కార్మికులకు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించి, మందులు పంపిణీ చేశామని తెలిపారు. వార్డు సచివాలయాల వారీగా ఉత్తమ సేవలు అందించిన 70 మంది పారిశుధ్య కార్మికులను బాలినేని ప్రత్యేకంగా సన్మానించారు. ప్రశంసా పత్రాలు, పీపీ కిట్లు, దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ప్రాంగణంలో బాలినేని మొక్కలు నాటారు. తొలుత నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు నగరంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వేమూరి సూర్య నారాయణ, వెలనాటి మాధవరావు, పార్టీ నాయకులు కఠారి శంకర్, రాష్ట్ర ఆర్యవైశ్య ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, కార్పొరేటర్లు జడా వెంకటేశ్, యనమల నాగరాజు, ఆదిపూడి గిరిజా శంకర్ శాండిల్య, ఈదర సురేష్ బాబు, గోపిరెడ్డి గోపాల్ రెడ్డి, శ్రీరాం నాగ భూషణం, అంగిరేకుల గురవయ్య, ప్రవీణ్ కుమార్, వెంకటరెడ్డి, పసుపులేటి శ్రీనివాసరావు, చింతపల్లి గోపీచంద్, గండు మధు, ఎంఈ జానీ, డీఈ గణపతితో పాటు పలువురు పాల్గొన్నారు.



స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులను సన్మానించి పీపీ కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్లు సూర్యనారాయణ, మాధవ

గాంధీ ఆశయ సాధనకు కృషి



గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ,మేయర్ గంగాడ సుజాత, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ తదితరులు

- ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో గాంధీజీకి ఘన నివాళి

ఒంగోలు: మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తోందని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మహాత్మా గాంధీ 154వ జయంతి సందర్భంగా స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలోని వైఎస్సార్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ.. తెల్లదొరల బానిస సంకెళ్లు తెంచి దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి గాంధీజీ అహింస అనే ఆయుధం ద్వారా చేపట్టిన కార్యక్రమాలు నేటికీ ప్రపంచ వ్యాప్తంగా ప్రజలకు ఆదర్శంగా ఉన్నాయన్నారు. గ్రామ సీమల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని గాంధీజీ భావించారని, అందుకు అనుగుణంగా రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది మహాత్ముని ఆశయసాధనకు కృషి చేసిందని వివరించారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు.

నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ.. స్వరాజ్య స్థాపన కోసం హింస కన్నా అహింస మార్గమే మంచిదని భావించి ఆచరించి చూపిన మహనీయులు గాంధీ అని కొనియాడారు. మహాత్ముని అడుగు జాడల్లో ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర నాయకుడు కటారి శంకర్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, చాత్తాడ శ్రీవైష్ణవ కార్పొరేషన్ చైర్మన్ టి.మనోజ్ కుమార్, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, ఆగ్రో సంస్థ డైరెక్టర్ పురిణి ప్రభావతి, మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి బడుగు ఇందిర, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జి బొట్ల సుబ్బారావు, ప్రచార విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామరాజు క్రాంతికుమార్, జగనన్న ఫౌండేషన్ అధ్యక్షులు వారా వీర్రాజు, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు రేలా అమర్‌నాథ్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చింతగుంట్ల సువర్ణ, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షుడు, పార్టీ నాయకులు, అభిమానులు మిక్కిలిగా పాల్గొని మహాత్మునికి ఘన నివాళి అర్పించారు.

హుండీ చోరీకి పాల్పడిన పరిచారకుడు సస్పెన్షన్

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సీఎస్‌పురం మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో పరిచారకునిగా పనిచేస్తూ గత సెప్టెంబర్ నెల 18, 19వ తేదీల్లో హుండీ చోరీకి పాల్పడిన పరిచారకుడు కేవీ సరసయ్యను విధుల నుంచి తొలగించినట్లు ఈఓ జి.రమణారెడ్డి పేర్కొన్నారు. చోరీ ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఈవో తెలిపారు.

'బ్లేడ్ బాబు' పరార్!

గిద్దలూరు రూరల్: గిద్దలూరు పట్టణంలో పలువురిపై బ్లేడుతో పైశాచికంగా దాడి చేసి గాయపరచిన బాలుడు పోలీసుల కళ్లుగప్పి పరారయ్యాడు. ఈ సంఘటన ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో సెప్టెంబర్ 30వ తేదీన చోటుచేసుకుంది. వివరాలు.. గిద్దలూరు పట్టణానికి చెందిన ఇంటర్మీడియెట్ విద్యార్థి తాను చదివే కళాశాల ప్రిన్సిపాల్ కొండారెడ్డిపై మూడు నెలల క్రితం బ్లేడుతో దాడి చేసి గాయపరచాడు. సెప్టెంబర్ 28వ తేదీన రమేష్ అనే వ్యక్తి ముఖంపై బ్లేడుతో దాడి చేశాడు. బ్లేడుతో అలా ఎందుకు చేస్తున్నాడో తెలియక బాధితులు అయోమయంలో ఉండిపోయారు. పోలీసులు ఆ బాలుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఆ బాలుడిని తిరుపతిలోని ప్రత్యేక బాలల నిర్బంధ కేంద్రానికి తరలిస్తుండగా ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో పోలీసుల కళ్లుగప్పి తప్పించుకున్నాడు. ఆ బాలుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

క్రీడలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
- ప్రకాశం ప్రీమియర్ లీగ్ విజేతలకు బహుమతులు పంపిణీ
- ప్రథమ, ద్వితీయ స్థానాల్లో రాయవరం, చిన్నమజీద్ జట్లు



విజేతగా నిలిచిన రాయవరం జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగానే ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి పేర్కొన్నారు. గత 9 రోజులుగా మార్కాపురం పట్టణంలోని ఎస్‌వీకేపీ కళాశాల మైదానంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి కుమారుడు రాఘవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రకాశం ప్రీమియర్ లీగ్ టి-10 క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి.

విజేతలకు బహుమతుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ.. గెలుపోటములను సమానంగా తీసుకోవాలని, క్రీడలతో ఐక్యత పెరుగుతుందన్నారు. మార్కాపురం ప్రాంతంలో మాగుంట కుటుంబం క్రికెట్ టోర్నీ నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రథమ బహుమతి రూ.50 వేలను రాయవరం జట్టు, రెండో బహుమతి రూ.30 వేలను చిన్నమజీద్ లెవెన్స్ జట్లకు అందించారు. బెస్ట్ బ్యాట్స్‌మన్‌గా లక్ష్మీ నారాయణ, బెస్ట్ బౌలర్‌గా గురవయ్య, బెస్ట్ ఫీల్డర్‌గా పఠాన్, మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా ఆది ఎంపికయ్యారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, ఏఎంసీ చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, టోర్నీ ప్రతినిధులు వెంకటాద్రి, సాగర్, కృష్ణారెడ్డి, ఉత్తమకుమార్, ప్రతాపరెడ్డి, సుమన్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత మహాత్మా గాంధీ



కలెక్టరేట్‌లో బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్ఓ శ్రీలత, అధికారులు



జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎస్పీ మలికా గర్గ్

- ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: శాంతి, అహింస సిద్ధాంతాలతో దేశ ప్రజల్లో స్వరాజ్య కాంక్షను రగిలిండంలో మహాత్మా గాంధీ విజయం సాధించారని ఎస్పీ మలికాగర్గ్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ 154వ జయంతిని ఘనంగా నిర్వహించారు. బాపూజీ చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ.. గాంధీ అహింస, సత్యాగ్రహం అనే ఆయుధాలతో దేశ స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపారని గుర్తు చేశారు. బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా దేశ ప్రజలను ఏకతాటి మీదకు తీసుకురావడంలో, జాతీయోద్యమాన్ని శాంతియుతంగా నిర్వహించడంలో చూపిన చొరవతో గాంధీ ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. గాంధీ ఆలోచనలు, సంస్కరణలు ఎప్పటికీ ఆదర్శనీయమని, ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. శాంతి, సమానత్వం, మతసామరస్యం, సోదరభావంతో జీవించినపుడే గాంధీకి నిజమైన నివాళి అర్పించినట్లవుతుందన్నారు. కార్యక్రమంలో ఏఆర్ ఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాపూజీ స్ఫూర్తితో సేవలు అందించాలి

ఒంగోలు అర్బన్: మహాత్మా గాంధీ అహింస, నీతి, నిజాయతీలతో ప్రజలందరినీ ఏకతాటిపైకి తెచ్చి దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చారని, అదే స్ఫూర్తితో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ప్రజలకు సంతృప్తికరమైన సేవలు అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో మహాత్ముని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి కె.చిరంజీవి, కలెక్టరేట్ విభాగాధిపతులు రాజ్యలక్ష్మి, రవి, లక్ష్మీనారాయణ, సిబ్బంది గౌతమి, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



ఈ-క్రాప్ వివరాలు పరిశీలిస్తున్న జేడీఏ శ్రీనివాసరావు

మార్కాపురం రూరల్: రైతులు తాము సాగు చేసిన పంటలను ఈ-క్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని జేడీఏ శ్రీనివాసరావు సూచించారు. పంట నమోదు అనంతరం వివరాలు సరిచూసుకోవాలని స్పష్టం చేశారు. సోమవారం వేములకోట, చింతగుంట్ల గ్రామాల్లో పర్యటించిన జేడీఏ.. స్థానిక రైతులతో మాట్లాడారు. ఖరీఫ్ 2023లో రైతులు సాగు చేసిన పంటల వివరాలు సక్రమంగా ఉన్నాయా లేదా అని డీఏఓ శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. ఏడీ దేవిరెడ్డి శ్రీనివాసులు, వేములకోట, చింతగుంట్ల వీఏఏలు మల్లికార్జున్, వెంకటేశ్వరరెడ్డి, ఎంపీఈఓ భాగ్యలక్ష్మి, వీఆర్ఓ వలి, సర్వేయర్ పాల్గొన్నారు.